క్లుప్తంగా

కొంకాపల్లిలో పర్యటించిన డీఎంఅండ్‌హెచ్‌ఓ



కొంకాపల్లిలో పర్యటిస్తున్న డీఎంఅండ్‌హెచ్‌ఓ దుర్గారావు దొర

అమలాపురం రూరల్: మండలంలోని పేరూరు గ్రామ పరిధి కొంకాపల్లిలో పలువురికి డెంగ్యూ లక్షణాలు కనిపించడంతో డీఎంఅండ్ హెచ్‌ఓ ఎం.దుర్గారావుదొర బుధవారం ఆ ప్రాంతంలో పర్యటించారు. జ్వరాలు రావడానికి గల కారణాలను ఆరా తీశారు. కొంకాపల్లిలో కొనసాగుతున్న వైద్య శిబిరాన్ని తనిఖీ చేశారు. గ్రామంలో ప్రత్యేక పారిశుధ్య చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ఆయన వెంట వైద్యాధికారి సత్యం, సూపర్‌వైజర్ కామేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

కలెక్టర్‌ను కలిసిన మండల కోఆప్షన్ సభ్యుడు



కలెక్టర్ మహేష్‌కుమార్‌కు పూలమొక్కను అందిస్తున్న స్వర్ణన్‌రాజు

అమలాపురం రూరల్: కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్‌ను ఆయన కార్యాలయంలో మండల కోఆప్షన్ సభ్యుడు మొసలి స్వర్ణన్‌రాజు బుధవారం మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మహేష్‌కుమార్‌కు పూలమొక్కను బహూకరించారు. క్రిస్టియన్, మైనార్టీలకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కల్పిస్తున్న ప్రయోజనాలను అందించేందుకు సహకరించాలని కలెక్టర్‌ను కోరారు.

ముంపు ప్రాంతాల పరిశీలన



పోలేకుర్రు యాదవపేటలో రహదారిని పరిశీలిస్తున్న ఎంపీపీ రాయుడు సునీత తదితరులు

తాళ్లరేవు: గత కొన్ని రోజులుగా కురుస్తున్న భారీ వర్షాల కారణంగా ముంపునకు గురైన ప్రాంతాలను ఎంపీపీ రాయుడు సునీత బుధవారం పరిశీలించారు. పోలేకుర్రు పంచాయతీ యాదవులపేటలో జలమయమైన రహదారులను పరిశీలించి స్థానికులతో మాట్లాడారు. ఆమె వెంట పంచాయతీ కార్యదర్శి జ్యోతిసుధ, రాయుడు గంగాధర్, జక్కల ప్రసాద్‌బాబు, వీరన్నయాదవ్ తదితరులున్నారు.

కథల పోటీల్లో ప్రథమ బహుమతి



రత్నాకర్

యానాం: ఉషా పక్ష పత్రిక, తటవర్తి భారతీ సాహితీ సంస్థ(అమెరికా) సంయుక్తంగా నిర్వహించిన ప్రపంచ స్థాయి కథల పోటీల్లో యానాంకు చెందిన కథకుడు పెనుమాక రత్నాకర్‌కు ప్రథమ బహుమతి వచ్చింది. ఈ మేరకు బుధవారం తనకు సంస్థ నుంచి లేఖ అందిందని రత్నాకర్ తెలిపారు. ప్రపంచ నలుమూలల నుంచి కథకులు పాల్గొన్న ఈ పోటీల్లో అనేక వడపోతల తరువాత రత్నాకర్ కథ ప్రథమ బహుమతికి ఎంపికైంది. ఈ సందర్భంగా రత్నాకర్‌ను కలైమామణి దాట్ల దేవదానంరాజు తదితరులు అభినందించారు.

కొంకాపల్లిలో ఉచిత వైద్య శిబిరం

అమలాపురం రూరల్: మండలంలోని కొంకాపల్లికి చెందిన గుండుమోగుల బాలరాజు బుధవారం తన పుట్టినరోజు సందర్భంగా గ్రామంలోని ముత్యాలమ్మ ఆలయం వద్ద ఉచిత మెగా వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. శిబిరంలో రోగులకు వైద్యులు రక్త పరీక్షలు, ఈసీజీ పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో మెట్ల రమణబాబు, అల్లాడి శరత్ బాబు, నల్లా స్వామి, ఆశెట్టి ఆదిబాబు తదితరులు పాల్గొన్నారు.

అనుమతులు లేని లాడ్జిల మూసివేత

యానాం: పట్టణ పరిధిలో అనుమతులు లేకుండా నిర్వహిస్తున్న లాడ్జిలను ఇన్‌చార్జి మున్సిపల్ కమిషనర్ కె.రామకృష్ణ ఆధ్వర్యంలో బుధవారం తనిఖీ చేసి మూసేశారు. ఈ సందర్భంగా స్థానిక ఫెర్రీ రోడ్డులో ఉన్న మూడు, బైపాస్‌లో ఉన్న ఒక లాడ్జిని మూయించివేశారు. అధికారుల చర్యల కారణంగా సూర్య రెసిడెన్సీ, ఫెర్రీ స్పాట్, రివర్ రిసార్ట్, శ్రీమంకీస్ లాడ్జిలు మూతపడ్డాయి. వీటిపై అనేక ఫిర్యాదులు రావడంతో చర్యలు తీసుకున్నట్లు అధికారులు తెలిపారు.

ఆయుష్షు పోస్తున్న ఆరోగ్య మందిరం

- రోగులకు కొండంత అండగా నిలుస్తున్న కోరంగి ప్రభుత్వ హోమియో వైద్యశాల
- నాడు-నేడు పనులతో సర్వాంగ సుందరంగా ఆస్పత్రి

తాళ్లరేవు: ప్రస్తుతం దాదాపుగా అందరిదీ ఉరుకుల పరుగుల జీవితమే.. ప్రతిఒక్కరూ ఒత్తిడితో సహవాసం చేస్తున్నవారే.. ఏ ఇంట్లో చూసినా ఎవరొకరికి ఏదొక అనారోగ్యం.. అలాగని ప్రైవేటు ఆసుపత్రులకు వెళితే వైద్యం అత్యంత ఖరీదైన వ్యవహారంగా మారిపోయింది. బీపీ, షుగర్, గ్యాస్ట్రిక్, కీళ్లనొప్పులు తదితర వ్యాధులున్న వారైతే రోజూ మందుబిళ్లలు మింగుతుంటారు. అలాంటి వారందరికీ కోరంగిలోని ప్రభుత్వ ఉచిత హోమియో వైద్యశాల కొండంత అండగా నిలబడుతోంది. వైద్య సేవలతో పాటు సంపూర్ణ ఆరోగ్యాన్ని అందించే యోగాలో సైతం ఇక్కడ శిక్షణనిస్తుండడం విశేషం. ఒక్క తాళ్లరేవు మండలవాసులకు మాత్రమే కాకుండా కాకినాడ, అమలాపురం జిల్లావాసుల మన్ననలు సైతం అందుకుంటున్న కోరంగి ప్రభుత్వ హోమియోపతి వైద్యశాలపై 'సాక్షి' అందిస్తున్న ప్రత్యేక కథనమిది..

నాడు-నేడుతో మారిన రేపురేఖలు

తాళ్లరేవు మండలంలోని కోరంగిలో సుమారు 30 ఏళ్ల క్రితం ఉచిత హోమియో ఆస్పత్రి సేవలను ప్రారంభించారు. ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్ (ఆయుష్ విభాగం) ఆధ్వర్యంలో నిర్వహించే ఈ ఆస్పత్రి కొంతకాలం పాటు అద్దె భవనంలో కొనసాగింది. అయితే పాలేశ్వరరాజు అనే దాత స్థలాన్ని ఇవ్వడంతో ఆస్పత్రికి సొంత భవనం సమకూరింది. గతంలో వివిధ హోమియో ఆస్పత్రులకు ఒకే వైద్యుడు ఉండడంతో వారంలో ఒకటి రెండు రోజులు మాత్రమే సేవలు అందేవి. అయితే వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో నాడు-నేడు నిధులతో ఆస్పత్రిని అభివృద్ధి చేసి పూర్తి స్థాయి వైద్యాధికారిగా ఎం.విజయ ప్రతిభను నియమించారు. నాటి నుంచి ఆమె నేతృత్వంలో విస్తృత సేవలు అందిస్తుండడంతో కాకినాడ, అమలాపురం, రామచంద్రపురం, కొత్తపేట, రావులపాలెం తదితర ప్రాంతాల నుంచి వందల మంది రోగులు కోరంగి ప్రభుత్వ హోమియో వైద్యశాలలో చికిత్స తీసుకుంటూ సాంత్వన పొందుతున్నారు.



కోరంగిలోని ప్రభుత్వ ఉచిత హోమియో ఆస్పత్రి



ఆస్పత్రిలో యోగాపై శిక్షణ ఇస్తున్న మహిళా ట్రైనర్

దీర్ఘకాలిక వ్యాధులనుంచి విముక్తి

కోరంగి ప్రభుత్వ హోమియో వైద్యశాలకు వచ్చే రోగులకు కేవలం మందులిచ్చి పంపించేయకుండా యోగా శిక్షణను సిఫార్సు చేస్తున్నారు. ఆస్పత్రిలో ఇచ్చే యోగా శిక్షణ ద్వారా దీర్ఘకాలిక వ్యాధుల నుంచి అనేక మందికి విముక్తి కలిగిస్తున్నారు. ఒక మహిళా ట్రైనర్ రోజూ యోగాపై శిక్షణతో పాటు అనేక మెళకువలు నేర్పిస్తున్నారు. అంతేకాకుండా ఆస్పత్రి ఆధ్వర్యంలో ఒక యోగా ట్రైనర్ ప్రభుత్వ పాఠశాలలకు వెళ్లి అక్కడి విద్యార్థులకు యోగాపై ట్రైనింగ్ ఇస్తున్నారు. ఆస్పత్రి ప్రాంగణంలో ఆరోగ్యానికి ఎంతగానో ఉపకరించే ఔషధ మొక్కలను పెంచుతూ రోగులకు వాటిపై అవగాహన కల్పిస్తున్నారు. కాళ్లు, చేతులు, మెడ తదితర నొప్పులతో బాధపడుతూ ఆస్పత్రికి వచ్చేవారికి మందులతో పాటు యోగా థెరపీ ద్వారా సంబంధిత ఆసనాలను వేయించి నయమయ్యేలా చేస్తున్నారు. దీంతో కోరంగి హోమియో ఆసుపత్రికి చుట్టుపక్కల ప్రాంతాల్లోని ప్రజల్లో ఆదరణ బాగా పెరిగింది.

ఓపీ బాగా పెరిగింది



గతంలో కన్నా ఇప్పుడు ఓపీ బాగా పెరిగింది. ఆస్పత్రి భవనాన్ని అభివృద్ధి చేయడంతో పాటు పూర్తిస్థాయిలో వైద్యులు అందుబాటులో ఉండడంతో దూరప్రాంతాల నుంచి సైతం రోగులు వచ్చి సేవలు పొందుతున్నారు. అలాగే దీర్ఘకాలిక వ్యాధుల నివారణకు ప్రత్యేక యోగా ట్రైనర్ల ద్వారా విద్యార్థులకు, మహిళలకు ప్రత్యేక శిక్షణ ఇస్తున్నాం.

– ఎం.విజయ ప్రతిభ, వైద్యాధికారి, ప్రభుత్వ హోమియో వైద్యశాల, కోరంగి

మంచి సేవలు అందిస్తున్నారు



గత నాలుగేళ్లుగా ఈ ఆస్పత్రిలో వైద్య సేవలు పొందుతున్నాం. ఎలాంటి అనారోగ్యానికైనా ఇక్కడ ఉచితంగా మందులిస్తున్నారు. ఇక్కడ మందులు వాడాక మా అమ్మకు కీళ్ల నొప్పులు తగ్గాయి. వైద్యంతో పాటు యోగాలో సాధన చేయిస్తుండడం వల్ల సంపూర్ణ ఆరోగ్యం సిద్ధిస్తుంది.

– బులుసు లలిత, రామచంద్రపురం

దీర్ఘకాలిక వ్యాధులకు చెక్



ఈ ఆస్పత్రిలో అన్ని రకాల వైద్యసేవలు అందించడంతో పాటు దీర్ఘకాలిక వ్యాధులను కూడా రూపాయి ఖర్చు లేకుండా నయం చేస్తున్నారు. గత 30 ఏళ్లుగా మా కుటుంబ సభ్యులు హోమియో వైద్యాన్ని పొందుతున్నాం. మాజీ మంత్రి చిక్కాల రామచంద్రరావు హయాంలో ఈ ఆస్పత్రిని ఏర్పాటు చేశారు. అప్పటి నుంచి వైద్య సేవలను పొందుతున్నాం.

– దంగేటి అప్పారావు, జగన్నాథపురం, కాకినాడ

నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలి



డీఆర్వో వెంకటేశ్వర్లుకు వినతి పత్రం అందిస్తున్న బీజేపీ కిసాన్ మోర్చా ప్రతినిధులు

అమలాపురం రూరల్: కోనసీమలో వర్షాలు, వరదల వల్ల నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని కోరుతూ డీఆర్వో వెంకటేశ్వర్లుకు జిల్లా బీజేపీ జాతీయ కిసాన్ మోర్చా సభ్యులు నల్లా పవన్ కుమార్, జిల్లా కిసాన్ మోర్చా అధ్యక్షుడు విళ్ల దొరబాబు, రాష్ట్ర కిసాన్ మోర్చా కార్యవర్గ సభ్యులు కంకిపాటి సుబ్బారావు, జిల్లా ప్రధాన కార్యదర్శి వేగి వెంకటేశ్వరరావు తదితరులు బుధవారం వినతిపత్రం అందజేశారు. వర్షాల వల్ల ఆకుమడులు దెబ్బతిన్నాయని రైతులందరికీ మళ్లీ విత్తనాలు సరఫరా చేయాలని, అప్పనపల్లి పెదపట్నం లంక, దొడ్డవరం నదీ తీర ప్రాంతాలు కోతకు గురికాకుండా రక్షణ గట్టు ఏర్పాటుచేయాలని కోరారు. కార్యక్రమంలో అయ్యల బాషా, గోకరకొండ గంగన్నస్వామి, కొండ రాంబాబు, ఆకుమర్తి బేబీ రాణి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా లక్ష్మణస్వామివర్మ జయంతి

తాళ్లరేవు: అగ్నికుల క్షత్రియుల జాతిపిత పొన్నమండ లక్ష్మణ స్వామివర్మ 155వ జయంతి మహోత్సవాలను బుధవారం కోరంగిలో ఘనంగా నిర్వహించారు. అగ్నికుల క్షత్రియ ఐక్య మహా సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమానికి ముమ్మిడివరం ఎమ్మెల్యే దాట్ల సుబ్బరాజు, పుదుచ్చేరి ప్రభుత్వ ఢిల్లీ ప్రత్యేక ప్రతినిధి మల్లాడి కృష్ణారావు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. తొలుత జ్యోతి ప్రజ్వలన చేసి లక్ష్మణ స్వామివర్మ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా లక్ష్మణ స్వామివర్మ జీవిత విశేషాలను వివరిస్తూ ప్రదర్శించిన నాటకం అందరినీ విశేషంగా ఆకట్టుకుంది. కార్యక్రమంలో కోరంగి సర్పంచ్ పెయ్యల మంగేష్, మహా సంఘం ప్రతినిధులు బొడ్డు సత్యనారాయణ, దండుప్రోలు నాగబాబు, శ్రీను, సంగాడి రాంబాబు, బర్రె సత్యనారాయణ, మల్లాడి ఈశ్వరరావు, ఓలేటి నరసింహం తదితరులు పాల్గొన్నారు.

టిడ్కోలో పారిశుధ్యంపై స్పెషల్ డ్రైవ్

'సాక్షి' కథనానికి స్పందన

అమలాపురం టౌన్: బోడసకుర్రులోని టిడ్కో ఇళ్ల సముదాయం వద్ద అవుట్‌ఫాల్ డ్రెయిన్ లేక నెలకొన్న అపారిశుధ్య పరిస్థితులపై ఈ నెల 5వ తేదీన టిడ్కో.. అసౌకర్యాలు ఇవిగో శీర్షికన 'సాక్షి' దినపత్రికలో ప్రచురితమైన కథనంపై మున్సిపాలిటీ అధికారులు స్పందించారు. కమిషనర్ ఎస్.మనోహర్ ఆదేశాలతో మంగళవారం మున్సిపల్ ఏఈ కె.వెంకటేష్, ఐదుగురు శానిటేషన్ అండ్ ఎన్విరాన్‌మెంట్ సెక్రటరీల ఆధ్వర్యంలో పారిశుధ్య కార్మికులు స్పెషల్ డ్రైవ్ చేపట్టారు. అపార్ట్‌మెంట్ల చుట్టూ నిలిచిపోయిన ముంపునీటితో పాటు చెత్త చెదారాలను తొలగించారు. అలాగే డ్రెయిన్లలో పూడికలు తీశారు. అనంతరం జంగిల్ క్లియరెన్స్ చేపట్టారు. అంతేకాకుండా ఇక నుంచి ప్రతి మంగళవారం 31 మంది పారిశుధ్య కార్మికులతో టిడ్కో గృహాల వద్ద స్పెషల్ డ్రైవ్ నిర్వహించాలని మున్సిపాలిటీ ఉన్నతాధికారులు నిర్ణయించారు. గతంలో టిడ్కో విధుల్లో ఐదుగురు పారిశుధ్య కార్మికులు మాత్రమే ఉండేవారు. వీరికి అదనంగా ప్రతి మంగళవారం స్పెషల్ డ్రైవ్ కోసం 31 మంది కార్మికులను నియమించడంపై టిడ్కో నివాసితులంతా సంతోషం వ్యక్తం చేశారు. వార్డు సచివాలయాల శానిటేషన్ అండ్ ఎన్విరాన్‌మెంట్ కార్యదర్శులు బండి వీరన్న, సీహెచ్ఎల్ నాగేంద్ర ప్రసాద్, జి.సరోజిని, ఎం.భవాని, టి.భారతీదేవి తదితరులు పనులను పర్యవేక్షించారు.



టిడ్కో అపార్ట్‌మెంట్ల వద్ద స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తున్న కార్మికులు

ఎల్జీ కైలాష్‌నాథన్ ప్రమాణ స్వీకారం



ఎల్జీ కైలాష్‌నాథన్‌ను సత్కరించిన ఎమ్మెల్యే అశోక్

యానాం: పుదుచ్చేరి లెఫ్టినెంట్ గవర్నర్‌గా మాజీ ఐఏఎస్ అధికారి కైలాష్‌నాథన్ బుధవారం ప్రమాణ స్వీకారం చేశారు. రాజ్‌నివాస్ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో మద్రాస్ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి కృష్ణకుమార్ ఆయన చేత ప్రమాణ స్వీకారం చేయించారు. ఎల్జీగా బాధ్యతలు స్వీకరించిన తర్వాత వృద్ధాప్య, వితంతు, అవివాహిత స్త్రీలు, థర్డ్‌జెండర్‌లకు పింఛన్ల పంపిణీకి సంబంధించిన ఫైల్‌పై మొదటి సంతకం చేశారు. దీని ద్వారా యానాం, మాహే, కారైకల్, పుదుచ్చేరి రీజియన్లకు చెందిన 1,81,616 మంది లబ్ధి పొందనున్నారని చెప్పారు. ఈ సందర్భంగా ఎల్జీ కైలాష్‌నాథన్‌ను ఎమ్మెల్యే గొల్లపల్లి శ్రీనివాస్ అశోక్ దుశ్శాలువాతో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో సీఎం రంగసామి, హోంమంత్రి నమశ్శివాయం, స్పీకర్ సెల్వం తదితరులు పాల్గొన్నారు.

రేపు విద్యుత్ సరఫరాకు అంతరాయం

తాళ్లరేవు: చొల్లంగి, తాళ్లరేవు 33/11 సబ్‌స్టేషన్ల పరిధిలో ఈ నెల 9వ తేదీ శుక్రవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలగనున్నట్లు కాకినాడ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ ఎస్.ఉదయ్‌భాస్కర్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆయా సబ్‌స్టేషన్ల పరిధిలో చెట్ల కొమ్మల కత్తిరింపు పనుల నిమిత్తం చొల్లంగి, చొల్లంగిపేట, జి.వేమవరం, కొత్తూరు, రామన్నపాలెం, పటవల శాంతనమూల గ్రామాలకు విద్యుత్ సరఫరా నిలిచిపోనుందన్నారు.

కుళాయిల ద్వారా బురద నీరు రాకుండా చర్యలు

'సాక్షి' కథనానికి స్పందన

అల్లవరం: దేవగుప్తం రామాలయం వీధిలో కుళాయిల ద్వారా బురద నీరు సరఫరా అవుతుందని సాక్షిలో బుధవారం ప్రచురించిన కథనానికి అధికారులు స్పందించారు. అండర్ గ్రౌండ్ కుళాయిల ద్వారా బురదనీరు పైపుల్లోకి వెళ్లకుండా తక్షణమే వాటి ఎత్తు పెంచి సమస్య పరిష్కరించాలని పంచాయతీ కార్యదర్శి పి.శ్రీనివాస్, ఇంజినీరింగ్ అసిస్టెంట్ ధనకిషోర్‌ని ఎంపీడీఓ కృష్ణమోహన్ ఆదేశించారు. దీంతో కార్యదర్శి శ్రీనివాస్ బుధవారం ఉదయం దేవగుప్తం గ్రామంలో అండర్ గ్రౌండ్ కుళాయిలను గుర్తించి మరమ్మతులు నిర్వహించారు. అనుమతులు లేకుండా అనధికార కుళాయిలు ఏర్పాటు చేస్తే చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని కార్యదర్శి పి.శ్రీనివాస్ గ్రామస్తులకు తెలిపారు. ఆయన వెంట ధనకిషోర్, దొరబాబు ఉన్నారు.



దేవగుప్తంలో అండర్ గ్రౌండ్ కుళాయిల ఎత్తు పెంచుతున్న సిబ్బంది

శాంతి, సౌభ్రాతృత్వం కొనసాగాలి



పోస్టర్ ఆవిష్కరించిన అధ్యాపకులు

యానాం: అణుయుద్ధాల వంటి భయంకర దాడులకు ముగింపు పలకాలంటే వివిధ దేశాల మధ్య శాంతి, సౌభ్రాతృత్వం, స్నేహం కొనసాగాల్సిన ఆవశ్యకత ఉందని స్థానిక అంబేడ్కర్ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ నాగ అజ్మీరా పేర్కొన్నారు. బుధవారం జనవిజ్ఞానవేదిక ఆధ్వర్యంలో హిరోషిమా డే వారోత్సవాలను పురస్కరించుకుని కళాశాలలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా అజ్మీరా మాట్లాడుతూ సమాజాభివృద్ధికి అడ్డంకిగా మారిన మూఢ నమ్మకాలకు వ్యతిరేకంగా జనవిజ్ఞానవేదిక ప్రచారం చేస్తుందన్నారు. అనంతరం యుద్ధాలు వద్దు శాంతి కావాలంటూ పోస్టర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో కేవీవీ సత్యనారాయణ, హెచ్ఓడీ చంద్రశేఖరన్, ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ జయవీరన్, మాజీ సైనికుడు ఎన్‌వీ రమణ పాల్గొన్నారు.

ఆర్థిక సాయం అందజేత



కస్తూరిబాబు తల్లికి నగదు అందిస్తున్న విద్యార్థులు

యానాం: అనారోగ్యం కారణంగా చికిత్స పొందుతున్న విద్యార్థికి సహచర మిత్రులు ఆర్థిక సాయం చేశారు. స్థానిక రీజెన్సీ జూనియర్ కళాశాలలో చదువుతున్న రెండో ఏడాది ఎంపీసీ విద్యార్థి కొప్పనాతి కస్తూరిబాబు ఇటీవల అనారోగ్యం బారినపడి కాకినాడలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. దీంతో అతడికి సాయపడాలన్న ఉద్దేశంతో సహచర విద్యార్థులంతా కలిసి రూ.27,000 సేకరించి కస్తూరిబాబు తల్లికి బుధవారం అందజేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ మార్తాండప్రసాద్, అధ్యాపకులు పాల్గొన్నారు.

చేనేత కార్మికులను ప్రోత్సహించాలి



విలసవిల్లిలో కేక్ కట్ చేస్తున్న సర్పంచ్ ఊర్మిళాదేవి

ఉప్పలగుప్తం: సమాజంలో ప్రజలందరూ చేనేత వస్త్రాలను ధరించి చేనేత కార్మికులను ప్రోత్సహించాలని సర్పంచ్ సలాది ఊర్మిళాదేవి అన్నారు. బుధవారం ప్రపంచ చేనేత దినోత్సవం సందర్భంగా మండలంలోని విలసవిల్లి గ్రామ పంచాయతీలో సర్పంచ్ ఊర్మిళాదేవి కేక్ కట్ చేసి అందరికీ పంచిబెట్టారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నేత వృత్తినే నమ్ముకుని ఉన్న చేనేత కార్మికులను ప్రభుత్వం అన్నివిధాలా సహకరించి ఆదుకోవాలన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ గ్రామ కమిటీ అధ్యక్షుడు సలాది సతీష్, పుత్స్యల ఏసు, బళ్ల నాగసతీష్, కోలా ఏసు, నల్లా భైరవ్, రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

చేనేత కార్మికులకు సత్కారం

అమలాపురం రూరల్: మండలంలోని బండారులంకలో జాతీయ చేనేత దినోత్సవం ఘనంగా నిర్వహించారు. చేనేత కార్మికులను జిల్లా బీజేపీ మహిళా మోర్చా అధ్యక్షురాలు చిలకమర్తి కస్తూరి ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ఎ.బేబీరాణి, చిట్టూరి రాజేశ్వరి, ఆశపు చిన్న, జిల్లా చేనేత సెల్ కన్వీనర్ సోరపల్లి పద్మినీకుమార్ తదితరులు పాల్గొన్నారు.

నూతన ఆలయ రాతి పనులకు శ్రీకారం



వేంకటేశ్వరస్వామి ఆలయ రాతి పనులకు పూజలు చేస్తున్న మల్లాడి తదితరులు

యానాం: స్థానిక భూసమేత వేంకటేశ్వరస్వామి నూతన ఆలయ రాతి పనులకు వేదమంత్రోచ్చరణల నడుమ పుదుచ్చేరి ప్రభుత్వ ఢిల్లీ ప్రతినిధి మల్లాడి కృష్ణారావు బుధవారం రాత్రి శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా రాతి పనులు పర్యవేక్షిస్తున్న సిబ్బంది, కాంట్రాక్టర్లు, నిర్మాణ కమిటీ సభ్యులతో మల్లాడి కృష్ణారావు మాట్లాడి నాణ్యత, పటిష్టతకు ప్రాధాన్యం ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో ఆర్ఏఓ మునిస్వామి, ఇన్‌చార్జి మున్సిపల్ కమిషనర్ కె.రామకృష్ణ, కాపగంటి ఉమాశంకర్, మంచాల సాయికుమార్ తదితరులు పాల్గొన్నారు.

మృతుని కుటుంబానికి రూ.5 వేల సాయం

పి.గన్నవరం: వశిష్ట నదిలో ఇటీవల జరిగిన పడవ ప్రమాదంలో ఊడిమూడికి చెందిన యువకుడు చదలవాడ విజయకృష్ణ మృతి చెందగా అతడి కుటుంబానికి బుధవారం నామన ఫౌండేషన్ చైర్మన్ నామన రాంబాబు రూ.5 వేలను ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ చేతుల మీదుగా అందజేశారు. సర్పంచ్ నూకపెయ్యి ప్రసన్న కుమార్, ఎంపీటీసీ ఆదిమూలం సూరయ్యకాపు, నాయకులు వాసంశెట్టి కుమార్, తోలేటి సత్తిబాబు పాల్గొన్నారు.

తల్లిపాలతో చిన్నారుల ఆరోగ్య పరిరక్షణ



కొత్తపేట డిగ్రీ కళాశాలలో తల్లి పాల ప్రాముఖ్యతను వివరిస్తున్న వైద్య సిబ్బంది

రాజోలు: తల్లిపాలతో చిన్నారులకు ఆరోగ్య పరిరక్షణ కలుగుతుందని సోంపల్లి సర్పంచ్ కట్టా శ్రీనివాసరావు అన్నారు. బుధవారం సోంపల్లి మెయిన్ అంగన్‌వాడీ కేంద్రం వద్ద తల్లిపాలు వారోత్సవాలు నిర్వహించారు. నవజాత శిశువులకు తల్లిపాలు పట్టించడం వలన కలిగే ప్రయోజనాలను ఐసీడీఎస్ సూపర్‌వైజర్ క్రాంతికుమారి వివరించారు. అనంతరం పలువురు గర్భిణులకు సామూహిక సీమంతాలు నిర్వహించి పౌష్టికాహారం, బాల సంజీవని కిట్లు అందజేశారు. ఏఎన్ఎం పద్మజ, అంగన్‌వాడీ కార్యకర్త కె.దుర్గాభవాని, ఆయా సత్యవేణి తదితరులు పాల్గొన్నారు.

కొత్తపేటలో..

కొత్తపేట: తల్లిపాల ప్రాముఖ్యతపై మహిళలకు ముఖ్యంగా గర్భిణులు, బాలింతలకు అవగాహన కల్పించాలని అవిడి పీహెచ్‌సీ ఎంఎల్‌హెచ్‌పీ సూర్యకుమారి విద్యార్థినులకు సూచించారు. తల్లి పాల వారోత్సవాల్లో భాగంగా బుధవారం స్థానిక వీకేవీ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఎన్ఎస్ఎస్ యూనిట్, జువాలజీ విభాగం సంయుక్త ఆధ్వర్యంలో ప్రిన్సిపాల్ డాక్టర్ కె.పెద్దిరాజు అధ్యక్షతన తల్లి పాలు ప్రాముఖ్యతపై అవగాహన సదస్సు నిర్వహించారు. అలాగే మన ప్రాంతాల్లో తయారయ్యే చేనేత వస్త్రాలను ధరించడం ద్వారా చేనేత పరిశ్రమను ఆదరించి కాపాడుకుందామని ప్రిన్సిపాల్ అన్నారు. బుధవారం స్థానిక కళాశాలలో కామర్స్ విభాగం ఆధ్వర్యంలో ప్రిన్సిపాల్ అధ్యక్షతన చేనేత దినోత్సవాన్ని నిర్వహించారు. చేనేత ఉత్పత్తుల ప్రాముఖ్యతను వివరించారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ పీఓ డాక్టర్ డీసీహెచ్ పాపారావు, ఐక్యూసీ కోఆర్డినేటర్ కె.అంకమ్మరావు, లెక్చరర్లు సత్యనారాయణ, టి.రమాదేవి, నాగశ్రీలక్ష్మి, సత్య, బి.విజయకుమార్, వివిధ విభాగాల ఇన్‌చార్జ్‌లు, ఎంఎల్‌హెచ్‌పీ ధన వరలక్ష్మి, ఆశ కార్యకర్తలు, పాల్గొన్నారు.

స్టడీ మెటీరియల్ పంపిణీ



విద్యార్థులకు స్టడీ మెటీరియల్ పంపిణీ చేస్తున్న హెచ్‌ఎం, పూర్వ విద్యార్థులు

అంబాజీపేట: స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలో 2004లో పదో తరగతి చదివిన పూర్వ విద్యార్థులంతా కలసి అంబాజీపేట జెడ్పీ హైస్కూల్‌లో నిర్వహిస్తున్న మహిళా జూనియర్ కళాశాల విద్యార్థులకు, నోట్ పుస్తకాలు, స్టడీ మెటీరియల్‌ను బుధవారం పంపిణీ చేశారు. పూర్వ విద్యార్థులు మాట్లాడుతూ తమ జీవితాల్లో వెలుగు నింపిన స్కూల్‌ను మార్చిపోలేమన్నారు. తమలాగే ఉన్నత స్థానాలకు చేరాలని స్టడీ మెటీరియల్స్, బుక్స్ అందజేసి తద్వారా మెరుగైన ఫలితాలు సాధించాలని విద్యార్థులను కోరారు. అన్నిదానాల కన్నా విద్యాదానం గొప్పదని అందుకే విద్యార్థులను ప్రోత్సహించే పని చేశామన్నారు. ఇలాగే ప్రతి ఏడాది స్కూల్లో స్టడీ మెటీరియల్ అందజేస్తామని, అంతేకాకుండా తమకు చేతనైన సాయం చేసి ఉన్నత చదువుకు అవసరమైన సహాయం చేస్తామని చెబుతున్నారు విద్యార్థులు. అంతకుముందు పూర్వ విద్యార్థులు సమకూర్చిన నోట్ పుస్తకాలు, స్టడీ మెటీరియల్స్ హెచ్‌హెం కడలి సాయిరామ్ ఆధ్వర్యంలో విద్యార్థులకు పంపిణీ చేశారు.